అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-మంగళగిరి : చినకాకానిలో ఇటీవల గ్యాస్ బండ పేలి జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కగ్గా నరసింహారావు కుటుంబానికి మంగళగిరి గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. తొలుత సంఘం నాయకులు అగ్ని ప్రమాదంలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలించి, అనంతరం ఎన్నారై హాస్పటల్లో చికిత్స పొందుతున్న బాధితుడు నరసింహారావును పరామర్శించారు. సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు బాధిత కుటుంబానికి నగదు సాయం అందజేశారు. అనంతరం సంఘం అధ్యక్షులు పందేటి మాట్లాడుతూ తాపీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న నరసింహారావుకు అగ్ని ప్రమాదం వల్ల 40 శాతం శరీరం కాలినట్లు వైద్యులు చెబుతున్నారని, అయితే గ్యాస్ కంపెనీ యజమానులు ఇంతవరకు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అధికారులు బాధిత కుటుంబానికి సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జూట్రూ ఏడుకొండలు, నాయకులు గండికోట అచ్చయ్య, శివ, బి.మధు తదితరులు పాల్గొన్నారు.

మనోహర్ నాయుడు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : గుంటూరు నగర మేయర్ మనోహర్ నాయుడు తక్షణమే పవన్ కళ్యాణ్‌కి క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సోమవారం అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఆయన ఇంటి ముట్టడి కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో తాడేపల్లిలో జనసేన నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, మండల యువజన విభాగం అధ్యక్షులు తిరుమలశెట్టి నరసింహారావు, పట్టణ యువజన అధ్యక్షులు శింగంశెట్టి వెంకట్, మండల ఉపాధ్యక్షులు తంబి, పసుపులేటి అశోక్, మండల ప్రధాన కార్యదర్శి లాల్ చంద్, కుంచనపల్లి అధ్యక్షులు మేకల రాజా, ఉండవల్లి గ్రామ అధ్యక్షులు సిగిరిశెట్టి రాజా రమేష్, పట్టణ యువజన అధ్యక్షులు సింగంశెట్టి వెంకట్, మండల కార్యదర్శి అమ్మిశెట్టి సురేష్, పెనుమాక గ్రామ కార్యదర్శి ఎస్.సైదా, ఇజ్రాయల్, నాగరాజు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలంటూ పూజలు

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మంగళవారం పట్టణ బీసీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగిరి పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు ఆధ్వర్యంలో స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి సుపరిపాలన అందించే అవకాశాన్ని ప్రసాదించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ టీడీపీ వ్యవహారాల సమన్వయకర్త నందం అబద్దయ్య, తోట పార్ధసారధి, గోవాడ దుర్గారావు, కారంపూడి అంకమ్మరావు, గుత్తికొండ ధనుంజయరావు, మున్నంగి శివ శేషయ్య, ఊట్ల శ్రీమన్నారాయణ, ఆరుద్ర భూలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్ రావాలని పూజలు

విశాలాంధ్ర-గుంటూరు : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు త్వరగా బెయిల్ రావాలని నాజ్‌సెంటర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 108 కొబ్బరికాయలు కొట్టి ఆ దేవుడు ఆశీస్సులు ఎప్పుడూ చంద్రబాబుకు ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని సీఎం జగన్ గాలికొదిలేశారని, ప్రతిపక్షాలపై కక్షసాధింపులకే వైసీపీ పాలన పరిమితమైందని దుయ్యబట్టారు. చంద్రబాబుని ఎలాగైనా జైలులో ఉంచాలనేదే సీఎం జగన్ కుట్ర అని మండిపడ్డారు. ఆధారాలు లేకుండా ఏ చట్ట ప్రకారం చంద్రబాబును అరెస్టు చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. సంక్షేమం పేరుతో సంక్షోభాన్ని సృష్టిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పరితపించిన చంద్రబాబుకు అవినీతి మరక అంటించాలని కుట్రలు చేయడం దారుణమన్నారు. అలాంటి మనిషికి ప్రజలందరూ అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, నగర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రయాన్-3' విజయంపై సెమినార్

విశాలాంధ్ర-గుంటూరు : శాస్త్రవేత్తలు 'చంద్రయాన్-3' మిషన్ విజయవంతం చేసినందుకు గాను గుంటూరు పెదపలకలూరులోని విజ్ఞాన్ నిరులాస్ మహిళా కళాశాలలో విద్యార్థినీలకు మంగళవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు మాట్లాడుతూ మన శాస్త్రవేత్తల నిరంతర కృషి ఫలితంగా చంద్రుని దక్షిణ ధ్రువానికి సమీపంలో అడుగిడిన ప్రపంచంలోని మొదటి దేశం అన్న ఖ్యాతిని భారతదేశం సంపాదించుకుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాన్ రోవర్ ద్వారా ఏఏ సమాచారం అందుబాటులోకి వస్తుందనే విషయాన్ని విద్యార్థినీలకు వివరించారు. ప్రిన్సిపల్ పాతూరి రాధిక మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థినీలకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు సంధ్య, ప్రసన్న, దండమూడి విజయ్ పాల్గొన్నారు.

మేయర్ పదవికి కళంకం తెచ్చిన కావటి

విశాలాంధ్ర-గుంటూరు : రాజకీయంగా, సామాజికంగా ఎంతో ప్రఖ్యాతిగాంచిన గుంటూరు పట్టణానికి అత్యున్నత గౌరవప్రదమైన మేయర్ పదవిలో ఉంటూ ప్రతిపక్ష నాయకులపై సభ్యసమాజం సిగ్గుపడేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మేయర్ పదవికే కళంకం తెచ్చాడని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. శాంతియుతంగా నిరసనలు తెలియచేస్తున్న జనసేన పార్టీ కార్యకర్తల్ని గూండాలుగా అభివర్ణించటమే కాకుండా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అసభ్య పదజాలంతో దూషించిన మేయర్ తీరుపై ఆయన మంగళవారం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సుమారు పది లక్షల మంది ప్రజలకు ప్రధమ పౌరుడిగా సేవలందించాల్సిన స్థాయిలో ఉన్న మనోహర్ నాయుడు పవన్ కల్యాణ్‌పై వాడిన పదాలను మేయర్ కుటుంబ సభ్యులు కూడా ఆమోదించరన్నారు. అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి ప్రజల్లో, సొంత పార్టీలో విశ్వాసం కోల్పోయిన మనోహర్ గతి, మతి తప్పి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ముద్రగడ ఉద్యమాన్ని ఉపయోగించుకొని వైసీపీ కాపు నేతలు మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్లు, కార్పొరేటర్లు అయ్యారు కానీ కాపులకు వాళ్ళు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. కాపుల ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన మనోహర్‌కు కాపు కులానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. అడుగడుగునా పోలీసులు, అంగుళానికో బారికేడ్లు, మోచేతి నీళ్ళు తాగే తాబేదార్లని పెట్టుకొని సవాల్ విసరడం, రెచ్చకొట్టడం వైసీపీ నేతలకే చెల్లిందన్నారు. అధికారం శాశ్వతం అన్న భ్రమలో నుంచి వైసీపీ నేతలు ఎంత తొందరగా బయటపడితే అంత మంచిదన్నారు. పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను మేయర్ వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్‌లో రాజకీయంగా భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పోరాడే తరుణం ఆసన్నమైంది

- ప్రజల కోసం నేను... రాష్ట్ర కోసం ప్రజలు సిద్ధం కావాలి
- హఠాన్మరణం పొందిన ప్రతికుటుంబాన్ని పరామర్శిస్తా
- టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యులు నందమూరి బాలకృష్ణ

విశాలాంధ్ర-మంగళగిరి : దుర్మార్గుల దుష్ట రాజకీయాలు పెచ్చుమీరినప్పుడు, నీతిపరులు కష్టాల పాలైనప్పుడు ప్రజలు ఆగ్రహించకపోతే భవిష్యత్ పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయని, చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు ఈ దుష్టప్రభుత్వం పాల్పడిందని, మరిన్ని అరెస్ట్‌లకు సిద్ధమవుతోందని, ఏంజరిగినా.. ఎన్ని కేసులు పెట్టినా ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ప్రజాక్షేత్రంలోకి దిగడానికి సిద్ధమయ్యామని, ప్రజల కోసం నేను.. రాష్ట్రం కోసం ప్రజలు పోరాడటానికి సిద్ధంకావాల్సిన తరుణం ఆసన్నమైందని టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యులు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తేల్చి చెప్పారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ప్రజా నాయకుడని, ఆయనకు ప్రజలు, రాష్ట్రం తప్ప మరో ధ్యాస ఉండదన్నారు. కేవలం కక్షసాధింపుతోనే చంద్రబాబుని అరెస్ట్ చేశారన్నారు. చట్టాలను అతిక్రమించి, అవినీతి జరగని స్కిల్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ అమలుకు కేటాయించిన నిధులు పక్కదారి పట్టాయని అసత్యప్రచారం చేసి అభూత కల్పనలు సృష్టించారన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు పరాజయం తప్పదన్న భయంతోనే జగన్ ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడన్నారు. తాను 16 నెలలు జైల్లో ఉన్నాడు కాబట్టి, చంద్రబాబుని 16 రోజులైనా జైల్లో పెట్టాలన్న దురుద్దేశంతోనే తప్పుడు ఆధారాలతో ఫేక్ స్కామ్ సృష్టించారని మండిపడ్డారు. యువత భవితకోసం చేపట్టిన గొప్ప ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం తన కుట్ర రాజకీయాలతో నీరుగార్చే ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగితే, ప్రాజెక్ట్ అమలు, నిర్వహణ బాధ్యతలతో పాటు నిధులు విడుదల చేసిన అధికారుల్ని ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను టీడీపీ ప్రభుత్వంలో తెరపైకి తెచ్చింది ఇప్పుడున్న పభుత్వంలో కీలక స్థానంలో ఉన్న అజయ్ కల్లం రెడ్డి అయితే, ప్రాజెక్ట్ ఒప్పందంపై సంతకాలు పెట్టి, నిధులు విడుదల చేసింది ప్రేమచంద్రారెడ్డి అని, ఈ ప్రాజెక్ట్‌లో నిజంగా అవినీతి జరిగితే ఈ ఇద్దరు అధికారుల్ని ఇంతవరకు జగన్ ప్రభుత్వం, సీఐడీ ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో తొలుత వేసిన ఛార్జ్‌షీట్‌లో చంద్రబాబు పేరు ఎందుకు లేదని నిలదీశారు. ఎక్కడో రాయలసీమలో ఉన్న చంద్రబాబు వద్దకు వెళ్లి, అర్ధరాత్రి హడావుడి చేసి, ఆయన్ని అన్యాయంగా అరెస్ట్ చేయడం ఏమిటి? అంత సీన్ క్రియేట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇదంతా ప్రభుత్వ కుట్రలో, పథకం ప్రకారం జరిగిన కక్షపూరిత వ్యవహారమేనని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఏం జరిగినా.. ఎన్ని కుట్రలు పన్నినా చంద్రబాబు అగ్నిశిఖలా రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లోకి వస్తారని అన్నారు. తెలుగుదేశం ఎన్టీఆర్ గుండె ధైర్యం నుంచి, తెలుగువారి ఆత్మాభిమానం కోసం పుట్టిన పార్టీ అని, ఇలాంటి వాటికి పార్టీ కార్యకర్తలు వెరవరని అన్నారు. ఏపీ ప్రజలు ప్రస్తుతం జరుగుతున్న కుట్రలపై స్పందించాలని, భయానికి, బాధలకు వెరవకుండా హక్కుల కోసం... రాష్ట్రం కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని అన్నారు. ఎన్నికలు వచ్చేవరకు ఎదురు చూడటం కాదు... ప్రజలు రోడ్డెక్కాల్సిన సమయం వచ్చింది. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు పాల్పడిన ఈ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యులు, మండలి మాజీ ఛైర్మన్ ఎం.ఏ.షరీఫ్, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, పంచుమర్తి అనురాధ, నందిగామ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తంగిరాల సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి: నాదెండ్ల

విశాలాంధ్ర-గుంటూరు : జనసేన పార్టీ శ్రేణులను రెచ్చగొట్టేలా పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నగర మేయర్‌పై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని, లేకుంటే సుప్రీంకోర్టు ఆదేశాల ధిక్కరణ కింద దేశ అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్ళతామని జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో చట్టం అందరికీ సమానమేనని, ఎవరు తప్పు చేసిన ఒక్కటేనని, అధికారంలో ఉన్న వారికి ఒకలా, లేనివారికి మరొలా చట్టం పనిచేయకూడదన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎవరు చేసిన వారిపై హేట్ ఆఫ్ స్పీచ్ కింద పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మేయర్ చేసిన వ్యాఖ్యలను ఆయన కుటుంబసభ్యులు కూడా హర్షించరన్నారు. వైసీపీ నాయకుడి మన్ననలు పొందడానికి కింది స్థాయి నాయకులు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. పవన్ కళ్యాణ్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి అశాంతి రేపిన గుంటూరు మేయర్‌పై గుంటూరు అర్బన్ పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ద్వేషపూరిత ప్రసంగాలు, వ్యాఖ్యలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని చట్టంలో స్పష్టంగా ఉందని అన్నారు. ఈ అంశాన్ని గుంటూరు అర్బన్ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సరిగా స్పందించలేదన్నారు. 24 గంటల్లో గుంటూరు మేయర్‌పై కేసు దాఖలు చేయని పక్షంలో పోలీసు ఉన్నతాధికారులపై సుప్రీం కోర్టు ఆదేశాల ఉల్లంఘన పిటీషన్ దాఖలు చేస్తామని అన్నారు. రూల్ ఆఫ్ లా అనేది పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. వైసీపీ నేతల ఇసుక దోపిడీ, అవినీతిపై ఢిల్లీ వెళ్ళి ఈడీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. తొలుత పోలీసు ఆంక్షల నడుమ మనోహర్ మంగళగిరి పార్టీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి భారీ ర్యాలీగా గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్న పార్టీ నాయకులు గుంటూరు మేయర్ మనోహర్ నాయుడుకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. మీడియా సమావేశం అనంతరం లాడ్జి సెంటర్ కూడలి వద్ద మేయర్ వ్యాఖ్యలకు నిరసనగా ధర్నాకు దిగారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులు నేరెళ్ల సురేష్, అమ్మిశెట్టి వాసు, సయ్యద్ జిలాని, నయూబ్ కమాల్, విజయ్ శేఖర్, ఆమంచి సోములు, బండారు రవికాంత్, కన్నా రజని పాల్గొన్నారు.

ఇదే స్ఫూర్తితో నగరానికి మరింత కీర్తి తీసుకురండి

నగర కమిషనర్‌ను అభినందించిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరా న్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమెట్ చేంజ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో చేపట్టిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో మూడవ ర్యాంక్ రాగా, దక్షిణ భారతదేశంలో గుంటూరు నగరానికి మాత్రమే స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో ర్యాంక్ వచ్చింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపా ల్‌లో ఈ నెల 7వ తేదీన జరిగిన కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర నాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరిలు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో ప్రదానం చేసిన ఆవార్డును చూపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కమిషనర్‌కు పుష్పగుచ్చం అందించి అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలతో నగరానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్ పాల్గొన్నారు.

కంకణాల హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర-మంగళగిరి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మేయర్ ఇంటి ముట్టడికి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం తెల్లవారుజామున చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జనసేన పార్టీ నేత కంకణాల శంకర్‌రావుకి పోలీసులు నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేశారు. రూరల్ నాయకులు వాసా శ్రీనివాసరావు, పట్టణ జనసేన యువజన నాయకులను స్టేషన్‌కు తరలించి నోటీసులు ఇచ్చి పంపించారు.

కాశయ్యకు సీపీఐ నేతల పరామర్శ

విశాలాంధ్ర-తాడేపల్లి : గత నెల రోజుల క్రితం రోడ్డు ప్రమా దంలో కాలుకు ప్యాక్చరై ఆపరే షన్ చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీపీఐ నాయ కులు, ప్రజానాట్యమం డలి కళాకారుడు కంచర్ల కాశయ్యను మంగళవారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తుమ్మల బాబురావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలు సుకున్నారు. షుగర్ కంట్రోల్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బాలకృష్ణకు స్వాగతం పలికిన సాయికృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఉమ్మడి గుంటూ రు జిల్లా తెలుగుదేశం పార్టీ విస్తృస్థాయి సమావేశానికి హాజరయ్యేందుకు హిందూ పురం శాసనసభ్యులు నంద మూరి బాలకృష్ణ మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద గుంటూరు పశ్చిమ టిడిపి ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్ర, టీడీపీ, తెలుగుయువత నాయకులతో కలిసి గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, తదితరులు ఘన స్వాగతం పలికారు.

శ్రీనివాసరెడ్డికి ఏఎన్‌యూ ప్రతిభా పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏఎన్‌యూ ప్రాంగణంలోని 'డాక్టర్ హెచ్‌హెచ్ డైక్‌మెన్ అండ్ డాక్టర్ ఎస్.జాన్ డేవిడ్ ఆడిటోరియం'లో వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందించిన వారికి ప్రతిభా పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఏఎన్‌యూ వైస్ ఛాన్సులర్ ఆచార్య రాజశేఖర్ సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి విశిష్ట అతిధిగా ఏఎన్‌యూ మాజీ వైస్ ఛాన్సులర్ ఆచార్య వి.బాలమోహన్ దాస్‌లు పాల్గొని వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ న్యూరో సర్జన్, బృంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డికి ప్రతిభా పురస్కార అవార్డు అందజేశారు. డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి గుంటూరు జీజీహెచ్ న్యూరో సర్జన్‌గా పని చేస్తూ తన రెండు నెలల జీతాన్ని కొవిడ్ సమయంలో ప్రధానమంత్రి సహాయ నిధి, సీఎం సహాయ నిధికి విరాళంగా అందజేశారు. అనేక మంది పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి ప్రాణదాతగా నిలిచారు. బ్రెయిన్ సర్జరీల్లో అత్యంత ఆధునిక వైద్య పద్ధతిలో చేస్తూ రికార్డులు సృష్టించారు. సీఎం వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారాన్ని బ్రెయిన్ ట్యూమర్ రోగికి ల్యాప్‌ట్యాప్‌లో చూపిస్తూ మెలకువ ఉండగానే అరుదైన ఆపరేషన్ చేశారు. వైద్యుడిగా ఆయన సేవలకు గుర్తింపుగా ఏఎన్‌యూ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతిభా పురస్కారం అందజేసింది. పేదలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలకు గానూ గత నెల 15న బెస్ట్ డాక్టర్ అవార్డును జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా అందుకున్నారు.

నులకపేటలో భారీ కొండచిలువ పట్టివేత

విశాలాంధ్ర-తాడేపల్లి : నులకపేటలో భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. అకస్మాత్తుగా జనాల మధ్యలోకి వచ్చిన కొండచిలువను చూసి ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. స్థానికంగా పాములు పట్టే ఆరోగ్యం అనే వ్యక్తికి సమాచారం ఇవ్వటంతో చాకచక్యంగా కొండచిలువను పట్టుకొని స్థానిక కొండపైన వదిలిపెట్టారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకుండా కొండ చిలువని పట్టుకోవడంతో స్థానిక ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జీతాలు, పెన్షన్లు చెల్లింపులో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, నేటి వరకు కూడా కొంత మందికి చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని ఎస్టీయూ గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు గేరా మోహనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్టీయూ కాకుమాను మండల శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి కాంద్రు సద్గుణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్టీయూ గుంటూరు జిల్లా పూర్వాధ్యక్షులు గేరా మోహనరావు, జిల్లా కార్యదర్శి మద్దిరాల వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రంలో చదువుకున్న నిరుద్యోగుల కోసం తక్షణం మెగా డీఎస్సీ వేయాలని, ఖాళీగా ఉన్న 40 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీఓ 117ను రద్దు చేయాలని, తరగతుల విలీనం ఉపసంహరణ చేయాలని, ప్రభుత్వంలో విలీనం అయిన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మద్దిరాల వెంకటేశ్వర్లు, కాంద్రు సద్గుణరావు, జొన్నకూటి సుబ్బారావు, జూపూడి ప్రకాశరావు, పొందుగల రవికుమార్, డీపీ జోసెఫ్, బి.శ్యామలాదేవి, టి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌పోస్టుమాస్టర్ తిరుమలరావు ఉద్యోగ విరమణ అభినందన

విశాలాంధ్ర-తెనాలి : తాను నమ్ముకున్న సిద్ధాంతాన్ని తూచ తప్పకుండా పాటస్తూ, కార్మికవర్గం కోసం యూనియన్‌లో సభ్యులకోసం నిరంతరం అధికారులపై పోరాటి వారికి న్యాయం చేయడంలో తిరుమలరావు సేవలను వక్తలు కొనియాడారు. తెనాలి, వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం కళ్యాణమండపంలో జరిగిన అభినందన సభకు డి.ఎస్.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. విజయవాడ రీజియన్ సి.యం.జి. డి.వి.యస్.ఆర్.మూర్తి మాట్లాడుతూ ఒకప్రక్క వృత్తిని దైవంగా భావించి పనిచేసి యూనియన్ కార్యకలాపాల్లో చురగ్గా పాల్గొనుటలో ఈయన పాత్ర వెలకట్టలేనిది అన్నారు. సూర్యుడు రాకముందు బయలుదేరి చంద్రుడు వచ్చిన తరువాత ఇంటికి వచ్చినా కుటుంబ సభ్యులు కూడా ఆయనకు పూర్తి సహాయసహకారాలు అందించారన్నారు. ఇటువంటి యూనియనిస్టు పియన్‌పిఓలో ముందు తరాల్లో మనకు ఎవరు కనపడకపోవచ్చని సమాజంలో ఇంతటి వ్యక్తిత్వం కలిగిన తిరుమలరావు డిపార్ట్‌మెంట్‌కు యూనియన్‌కు చేసిన విశిష్ట సేవలు అందరూ గుర్తుచేసుకోవాలన్నారు. అధ్యక్షత వహించిన డి.యస్.ఎన్. మాట్లాడుతూ ఉద్యోగం చేస్తూనే ఉద్యోగానికి భంగం లేకుండా యూనియన్ పనులు ఎల్లప్పుడూ నిర్వహించేవారని ఇలాంటి నాయకులు చాలా అరుదుగా ఉంటారని ఆయనకు అభినందనలు తెలిపారు. వృత్తి జీవితంలో భాగంగా భారత తపాలాశాఖలో చేరి రేపల్లె, కొల్లూరు, తెనాలి మారీస్‌పేట, పొన్నూరు, తెనాలి హెడ్‌ఆఫీస్ పోస్టువ ాస్టరుగా చేస్తూ విజయవాడ బకింగ్‌హాంపేట హెడ్‌పోస్టు మాస్టరుగా పదవీ విరమణ చేశారని, విజయవాడ ఉద్యోగులు కూడా ఈయన వ్యక్తిత్వాన్ని యూనియన్ సేవలను కొనియాడారని చెప్పారు. ఈ సందర్భంగా అన్ని పోస్టాఫీసు సెంటర్ల నుండి ఉద్యోగస్తులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. తన సన్మానానికి తిరుమలరావు కృతజ్ఞతలు తెలుపుతూ, ఉద్యోగ విరమణ చేసినా కార్మికుల కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఉద్యోగులు కూడా తమకు ఎప్పుడు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా కలుసుకోవచ్చునని ఎల్లప్పుడూ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో వివిధ పట్టణాల పోస్టుమాస్టర్లు, ముఖ్యంగా మహిళలు వచ్చి ఆయనకు సన్మానం చేశారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

సాంబశివరావును అభినందించిన డీఈఓ

విశాలాంధ్ర-గుంటూరు : గత 15 సంవత్సరాలుగా స్థానిక లాల్‌పురం కాటూరి పబ్లిక్ స్కూల్లో సైన్స్ టీచ ర్‌గా పనిచేస్తూ విజ్ఞానం వినోద కార్యక్రమాల ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాలలో లక్షన్నర మంది విద్యార్థులకు మాథ్స్, సైన్స్, ఎలక్ట్రానిక్స్ ప్రయోగాలపై శిక్షణ అందించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న చిపుకుల సాంబశివరావు ఇటీవల ఎల్డర్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి సేవా నంది నేషనల్ అవార్డ్స్ 2023 అవార్డు అందుకున్న సందర్భంగా జిల్లా విద్యా శాఖ అధికారి శైలజ తన కార్యాలయంలో కలిసిన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సాంబశివరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ సైన్స్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్, జవహర్‌లాల్ నెహ్రూ మాథ్స్, సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఎగ్జిబిషన్లు, సెమినార్స్ వంటి అనేక పోటీలలో తాను శిక్షణ ఇచ్చిన విద్యార్థులు పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు ప్రశంసాపత్రాలు పొందారని చెప్పారు. కార్యక్రమంలో కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిలక్ష్మి, కళాధర్, జీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాలకొండయ్య, బ్రహ్మయ్యల వర్ధంతి

విశాలాంధ్ర-గుంటూరు : మామిళ్ళపల్లి మాలకొం దయ్య 40వ వర్ధంతి, గుర్రం బ్రహ్మయ్య 42వ వర్ధంతి సభ స్థానిక శారదాకాలనీ స్థూపం సెంటర్‌లో ఈ నెల 13వ తేది సాయంత్రం 6 గంటలకు జరుగుతుందని సీపీఐ నగర కార్య దర్శి కోట మాల్యాద్రి తెలిపారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ మామిళ్ళపల్లి మాలకొండయ్య నగరంలోని పేద, బడుగు, బలహీన, పీడిత వర్గాల కోసం అనేక పోరాటాల్లో అగ్రభాగాన నిలిచి ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. కౌన్సిలర్‌గా ప్రజాసమస్యల పరిష్కారం కోసం జైలు జీవితాన్ని సైతం గడిపారని గుర్తు చేశారు. సంజీవనగర్, శారదకాలనీ, మాల కొండయ్య కాలనీ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారని చెప్పారు. ఆయన పురోభివృద్ధిని సహించలేని వారు ఆయనను హత్య చేసి నేటికీ 40 సంవత్సరాలు అవుతుందన్నారు. అలాగే కాకుమానువారితోట పార్టీ సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన గుర్రం బ్రహ్మయ్య 42వ వర్ధంతులను పురస్కరించుకొని జరిగే వర్ధంతి సభలో నగరంలోని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల సభ్యులు, సానుభూతిపరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్ కుమార్, చల్లా మరియదాసు, మహమ్మద్ జైద్(మున్నా), బండారపు యశ్వంత్(శశి), సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న తదితరులు పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ఈ నెల 19వ తేదిన వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పందిళ్ళు, మండపాలు, విగ్రహాల ఏర్పాట్లుకు తప్పనిసరిగా పోలీసులు అనుమతి పొందాలని ఎస్ఐ చల్లా కిషోర్ మంగళవారం తెలిపారు. జిల్లా ఎస్పి ఆరిఫ్ హాఫీజ్ ఉత్తర్వుల మేరకు విగ్రహాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవల్సిన అవసరం ఉందన్నారు. చవితి మండపాలు ఏర్పాట్లకు ఐదుగురుకు పైగా కమిటీలుగా ఏర్పడి పోలీసులకు కావల్సిన వివరాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతితో పాటు నిబంధనలు పాటించాలని తెలియజేశారు. ఉత్సవాలు ఎన్ని రోజులు నిర్వహించేది, నిమజ్జనం తేది, సమయాలు తెలియజేయాలన్నారు. ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే తక్కువ శబ్దాలతో మైక్‌లు ఉపయోగించాలని, విగ్రహాలు రోడ్లపై ఏర్పాటు చేయకూడదని నిబంధనలకు సంబంధించి ప్రతి ఒక్కటి అనుమతి పొంది పోలీసులకు సహకరించి ఎలాంటి అల్లర్లు జరగకుండా చూడాలని లేదంటే కారకులపై చట్టపర చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెల్లడించారు.

తప్పు చేసినందుకే జైలుకు

విశాలాంధ్ర-తాడికొండ : ఆర్థిక నేరాలకు పాల్పడి తప్పు చేసినందుకే నారా చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లారని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండ వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. చంద్రబాబు ఆర్థిక నేరాలపై సీఐడీ విచారణ జరిపిన నేపథ్యంలోనే వాస్త వాలు బయటికి రావడంతో జైలుకు వెళ్లారని చెప్పారు. వాస్తవాలను దాచి పెట్టాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని అన్నారు. పలుకేసుల్లో స్టేలు తెచ్చుకొని నన్ను ఎవరు ఏమి చేయరని విర్రవీగుతున్నారని మండిపడ్డారు. త్వరలో లోకేష్‌కు సైతం జైలు జీవితం తప్పదని జోస్యం చెప్పారు.

పరిసరాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-పొన్నూరు : ప్రతి ఒక్క విద్యార్థి తన జన్మదిన రోజున తప్పక ఒక మొక్క నాటాలని తద్వారా పర్యావరణం పట్ల ప్రేమను పెంచుకోవాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ రీజనల్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్ జీకే జుబేర్ కోరారు. అఫీషియల్ విజిట్‌లో భాగంగా పొన్నూరు మండల పరిధిలోని వెల్లలూరు గ్రామ జూనియర్ మహిళా కళాశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీజీటీ ఉపాధ్యాయుల డైరీలను, టీచర్ నోట్స్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల ప్రత్యేకతలను, సదుపాయాలను గురించి తెలిపారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఎంతో ప్రాధాన్యత కలిగినదని, జీవితంలో ఉన్నత శిఖరాలకు పునాది ఇక్కడ నుంచే ప్రారంభమవుతుందని, కావున విద్యార్థులు ఇంటర్మీడియట్ సమయంలో శ్రద్ధతో చదవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.రమేష్, అధ్యాపకులు ఎంఎం ఖుద్దుస్, వి.రమేష్, కె.బాబురావు, సృజన, నాగ పార్వతి, షహనాజ్, శ్రీనివాసరావు, టి.అరుణ్ కుమార్, డి.శాంతి రాజు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KANDE VENKATA SURESH BABU (Old Name), S/o. KHANDE MATTAPALLI, R/o. Door No.3-4-237/B, Uma Maheswara Rao Colony, Pattabhipuram, Near Swamy Theater, Guntur - 522006, Guntur District, Andhra Pradesh, have changed my name to KHANDE VENKATA SURESH BABU. Hereafter my name is known as KHANDE VENKATA SURESH BABU.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఓటమి భయంతోనే అరెస్టు

విశాలాంధ్ర-పెదకూరపాడు : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని, పరిపాలించడం చేతకాని జగన్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే దుశ్చర్యకు పాల్పడిందని టీడీపీ నేత, వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ నిర్వాకులు వట్టికుంట శేషగిరిరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో ఒక్క రూపాయి అయినా దుర్వినియోగమైందని సిమెన్ సంస్థ చెప్పిందా అని ప్రశ్నించారు. 2.13 లక్షల మంది విద్యార్థులకు శిక్షణను ఇస్తే 64,000 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. పార్టీ పిలుపుమేరకు గత మూడు రోజులుగా శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీస్ శాఖ తమ అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ అడుగడుగునా ఆటంకాలు సృష్టించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పోలీసులు ప్రభుత్వ ఉద్యోగులని, అధికార పార్టీ ఉద్యోగులు కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రజలను రక్షించేందుకు పోలీసు వ్యవస్థ ఉండాలే కానీ అధికార పార్టీ అక్రమాలకు అండగా నిలిచేందుకు కాదని అన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-వినుకొండ: పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఎవరైనా ఐ.టి.ఐ.లో చేరవచ్చునని శ్రీ బాలాజీ ఐ.టి.ఐ కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండలోని నరసరావుపేట రోడ్డులో గల శ్రీబాలాజీ ఐ.టి.ఐ. కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఐ.టి.ఐ. లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. ఈ నెల 23వ తారీకున జరగబోయే నాలుగో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు 19వ తేదీన మంగళవారం సాయంత్రం 5గంటల లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. వివరాలకు 94405420 30, 8341821710, 77028 92288 నంబర్లకు సంప్రదించాలన్నారు.

వీధి కుక్కలతో భయాందోళనలో స్థానికులు

విశాలాంధ్ర-బెల్లంకొండ : నిత్యం ఏదో ఒక చోట కుక్కలు చిన్నారులు, ప్రయాణికులపై స్వైర విహారం చేస్తున్నాయి. వీధి కుక్కల సంచారంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. వీధి కుక్కలను నిలువరించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. వీధుల్లో సంచరించాలంటేనే భయం గుప్పెట్లో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని మహిళలు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనునిత్యం మండల కేంద్రమైన బెల్లంకొండ మెయిన్ రోడ్‌లో వీధి కుక్కలు సంచారంతో ప్రయాణికులు, బాటసారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రధానంగా చికెన్ షాపుల యజమానులు కోడి వ్యర్థాలను రోడ్ల వెంట వేయటంతో గుంపులుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే ఎక్కడ కుక్కలు వెంటపడుతాయోనని భయం భయంగా వెళ్ళాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల భారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

కొత్త పెన్షన్‌లు పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని ఓబయ్య కాలనీ 9వ వార్డు సచివాలయంలో 23వ వార్డు కౌన్సిలర్ షేక్ నన్నేసా చేతుల మీదుగా మంగళవారం నూతనంగా మంజూరైన 27 పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు సహకారంతో పట్టణంలో ఆయా సచివాలయాల పరిధిలో నూతనంగా మంజూరైన వివిధ రకాల పెన్షన్లను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి వార్షికోత్సవం

విశాలాంధ్ర-పెదకూరపాడు : కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం పెదకూరపాడులోని పోలేరమ్మ తల్లి వార్షికోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్ళు నివేదన చేశారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కృష్ణంనేని లక్ష్మయ్య, గ్రామ ఉపసర్పంచ్ జాగర్లమూడి రఘు, సుంకర మల్లేశ్వరరావు, దర్శి శ్రీను ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. రాత్రి ఆచార్యలు తుళ్లూరు శివ ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

15న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-అమరావతి : మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఈ నెల 15వ తేది మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అమరావతి మండల ప్రజా పరిషత్ అధికారిని పి.ఉమాదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి అమరావతి మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు మేకల హనుమంతరావు అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. కావున సర్వసభ్య సమావేశానికి మండల పరిధిలో ఉన్న ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఆయా గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

టీడీపీ నియోజకవర్గ నాయకుల సమావేశం

విశాలాంధ్ర-పెదకూరపాడు : జిల్లా టీడీపీ విస్తృత సమావేశం మంగళవారం నిర్వహించారు. పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మాలపాటి శ్రీధర్, ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ సీఎం అక్రమ అరెస్టుపై నియోజకవర్గాల వారీగా చేపట్టవలసిన కార్యక్రమాలు, దిశానిర్దేశ అంశాలపై జిల్లాస్థాయి టీడీపీ నాయకులు పాల్గొని సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగాధర్, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు నూర్జహాన్, గంగినేని లీలావతి, నల్లమేకల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన 10 కుటుంబాలు

విశాలాంధ్ర-రెంటచింతల : రెంటచింతలలో సుమారు 10 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైసీపీ తీర్థం మంగళవారం రాత్రి పుచ్చుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముస్లిం సోదరులకు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గొట్టం బ్రహ్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వర రెడ్డి, పూజల రామయ్య, ఉమామహేశ్వరరెడ్డి, తుమ్మకోట పిహెచ్ ఖాన్, గఫార్ తదితరులున్నారు.

పౌష్టికాహారం పంపిణీ....

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని ఏ సెక్టార్ పరిధిలో గల కొండమెట్ల బజార్ మరియు బి సెక్టార్ కొండమెట్ల బజార్ అంగనవాడి కేంద్రం నందు మంగళవారం సిడిపిఓ ఎం అనురాధ అధ్యక్షతన పౌష్టిక ఆహార వారోత్సవాలలో భాగంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. చిరుధాన్యాలు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తహీనత నియంత్రించవచ్చు అని చెప్పారు కౌన్సిలర్ షకీలా దస్తగిరి ఎం అనురాధ సూపర్వైజర్ ది మరియాకుమారి అంగన్వాడీ కార్యకర్తలైన ఎస్. కె. మున్ని, ఎస్. కె. షకీలా పాల్గొన్నారు.

15న జరిగే 'చలో విజయవాడ' జయప్రదం చేయండి

విశాలాంధ్ర-అచ్చంపేట : రూపాయి రూపాయి కష్టపడి సంపాదించి భవిష్యత్తు తరాల కోసం అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేసజ అధిక మొత్తంలో వస్తుందని ఆశపడిన వారికి నిరాశే మిగిలిందని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, బైరాపట్నం రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం అచ్చంపేటలో అగ్రిగోల్డ్ బాధితులతో పాటు సీపీఐ కార్యకర్తలతో ఈ నెల 15వ తేదీ చలో విజయవాడ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ చేసిన మోసపూరితమైన చర్యలు వల్ల 19.52 లక్షల మంది ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కంపెనీ మోసంతో దిక్కుతోచని డిపాజిట్‌దారులు ఆత్మహత్యల వైపు అడుగులేస్తున్న సమయంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సాగించిన మహోన్నత ఉద్యమ పోరాట ఫలితంగా రూ.906 కోట్లను రూ.20 వేల లోపు ఉన్న డిపాజిట్ దారులకు రెండుసార్లుగా అందించారన్నారు. దీనిపై పూర్తిగా చెల్లించాలని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తున్న సందర్భంలో ప్రభుత్వ హామీ మేరకు విరమించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా కంపెనీదారులు యథేచ్ఛగా తిరుగుతూ డిపాజిట్‌దారుల సమస్యలను పరిష్కరించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వానికి అసోసియేషన్ ద్వారా విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేని కారణంగా ఈ నెల 15వ తేదీ చలో విజయవాడ కార్యక్రమాన్ని అసోసియేషన్ ద్వారా రూపకల్పన చేశారని, ఈ కార్యక్రమంలో బాధితులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నూకాలరావు, ప్రసాదు, రామాంజనేయులు, సీపీఐ నాయకులు మధు, చిన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జంప్ రోప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-పెదకూరపాడు : స్థానిక విజయ విద్యావిహార్ పాఠశాల విద్యార్థులు వేమా తేజస్విని, గట్టమనేని మల్లేశ్వరి, బిట్రగుంట యాబ్రహ్మ శ్రీజ, దేవాసి కవిత, షేక్ నూర్ అబ్బాస్‌లు తెనాలిలో జరిగిన జిల్లా స్థాయి జంప్ రోప్ కాంపిటీషన్‌లో సత్తాచాటి వరుసగా గోల్డ్, సిల్వర్, కాపర్ మెడల్స్ సాధించారు. వీరంతా నేషనల్స్‌కు ఎన్నికై అక్టోబర్‌లో జరిగే నేషనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున తమ ప్రతిభ ప్రదర్శించనున్నారు. విజయ విద్యావిహార్ నుంచి పాల్గొన్న ఐదుగురు కూడా మెడల్స్ సాధించి, నేషనల్స్‌కు ఎంపిక అవ్వడం పట్ల పాఠశాల సెక్రటరీ కొమ్మాలపాటి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు నోముల కోటేశ్వరరావు తమ సంతోషాన్ని తెలియచేస్తూ, విద్యార్థులను, పీఈటీ వాసంతిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కొమ్మాలపాటి రాధా, ఉపాధ్యాయులు శ్రీదేవి, రజని, లక్ష్మి అనిత, వాసు, పవన్, రామాంజనేయులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వీరు నేషనల్స్‌లో కూడా చక్కటి ప్రతిభ చూపి రాణించాలని ఆకాంక్షించారు.

రోడ్డుపై నీటితో వాహనదారులకు ప్రమాదాలు

విశాలాంధ్ర-బెల్లంకొండ : అనునిత్యం వందల వాహనాలు ఈ రహదారి గుండా వెళుతూ ఉంటాయి. బెల్లంకొండ ఊరి వెలుపల ఎర్రగుంట దాటిన తర్వాత మూల మలుపులో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పెద్ద పెద్ద లారీలు అధికలోడుతో వెళుతుండటంతో ఆర్ అండ్ బీ రోడ్‌పై గుంతలు ఏర్పడ్డాయి. ఆర్ అండ్ బీ అధికారుల పర్యవేక్షణ లేకపోవటం, వర్షాలు పడటంతో గోతులలో వర్షపునీరు నిలిచి ద్విచక్ర వాహనదారులు గోతులను తప్పించబోయి రోడ్‌పై పడి పలువురుకు గాయాలయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బెల్లంకొండ న్యూ చిట్యాల గ్రామం మూలమలుపులో వర్షపునీరు నిలబడి ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అదేవిధంగా మెరక సమీపంలో గోతులలో వర్షపునీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బాటసారులు, ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు రహదారిపై ఉన్న గోతులను పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరారు.

మేయర్ అనుచిత వ్యాఖ్యలు బాధాకరం

విశాలాంధ్ర-మంగళగిరి : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయటం బాధాకరమని కాపు సంక్షేమ సేన మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు విమర్శించారు. మంగళవారం సాయంత్రం గౌతమ బుద్ధ రోడ్డు వెంబడి ఊర్వశి థియేటర్ ప్రక్కన గల కాపు సంక్షేమ సేన నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మనోహర్ నాయుడు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు వెళుతుంటే జనసేన నాయకులను పోలీసులు గృహ నిర్బంధాలు, అరెస్టులు చేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ఆయన అన్నారు. జనసేన నాయకులు గంధం సుబ్బారావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఎవరికీ దత్తపుత్రుడు కాదని అంజనీపుత్రుడని అన్నారు. కావటి మనోహర్ నాయుడు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, మరోసారి పవన్ కళ్యాణ్‌పై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జనసేన నాయకులు కాపరౌతు సుందరచయ్య, బళ్లా ఉమామహేశ్వరరావు, మనికంట, లింగినేని శ్రీనివాసరావు, బాణాల నాగేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, చిల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా ఫుట్‌బాల్ సెలక్షన్స్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఈ నెల 14వ తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొర్రపాడులో గుంటూరు జిల్లా సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫుట్బాల్ సెలక్షన్స్ మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతాయని గుంటూరు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, సెక్రెటరీ దుర్గా మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక అయిన జిల్లా మెన్ అండ్ ఉమెన్ సీనియర్ ఫుట్బాల్ టీమ్స్ ఆంధ్రప్రదేశ్ ఫుట్బాల్ అసోసియేషన్ వారు జరిపే ఏపీ స్టేట్ లెవెల్ మెన్ అండ్ ఉమెన్ సీనియర్ ఇంటర్ డిస్టిక్ ఫుట్బాల్ టోర్నమెంట్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు షేక్ కరిముల్లా 99595 37355 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం వైసీపీ నాయకులు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 54వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో తురుమెళ్ళ గ్రామంలో గ్రామ సర్పంచ్ కాటం శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు కాటం బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ గాజుల మాణిక్యం ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలో వడ్లమూడివారిపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ గానుగపంట ఉత్తమరెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆ గ్రామ సచివాలయంలో జరిగిన జన్మదిన వేడుకలలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చి జగన్ మరలా ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తంచేశారు. తనను ఈ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అక్రమాలకు పాల్పడినందుకు అరెస్ట్ చేయటం జరిగిందని, దీంట్లో రాజకీయ ప్రమేయం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, మార్కెట్ యార్డు ఛైర్మన్ బత్తుల రామకృష్ణ, వైసీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల శివారెడ్డి, ఎంపీపీ గడ్డం వెంకట్రావు, వైసీపీ మండల నాయకులు అన్నెం పున్నారెడ్డి, తాడపనేని అక్కయ్య, పల్లపు అంజయ్య, కల్లి పిచ్చిరెడ్డి, కళ్ళం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్షవాత రోగులకు అత్యాధునిక వైద్యం

స్ట్రోక్ అలయన్స్ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ విజయ

విశాలాంధ్ర-గుంటూరు : పాశ్చాత్య దేశాలలో 91 శాతం స్ట్రోక్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, మన దేశంలో 18 శాతం మాత్రమే స్ట్రోక్ యూనిట్లు ఉన్నాయని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ అన్నారు. ఈ నెల 7, 8 తేదీలలో న్యూఢిల్లీలోని లీలా యాంబియన్స్ హోటల్‌లో జరిగిన గ్లోబల్ స్ట్రోక్ అలయన్స్ కాన్ఫరెన్స్‌లో రాష్ట్రం నుంచి డాక్టర్ పి.విజయ హాజరయ్యారు. సర్టిఫైడ్ స్ట్రోక్ సెంటర్‌ల ఏర్పాటు గురించి డబ్ల్యుఎస్‌ఓ ప్రెసిడెంట్ డాక్టర్ షీలా మార్టిన్స్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జయరాజ్ పాండియన్ నాయకత్వంలో జరిగిన సమావేశంలో ఆమె ప్యానలిస్ట్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీతో పాటు ప్రతి డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌లో కూడా సిటీ స్కాన్ అందుబాటులో ఉందని, హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో ప్రైమరీ స్ట్రోక్ సెంటర్లని అనుసంధానం చేసి అభివృద్ధి చేస్తే పక్షవాత రోగులకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్ట్రోక్ కేర్‌ను పెంపొందించడానికి కట్టుబడి ఉన్న శక్తివంతమైన ప్రపంచ కూటమిని స్థాపించడమే లక్ష్యంగా జరిగిన సదస్సులో పలువురు ఆరోగ్య మంత్రులు, ఐసీఎంఆర్ ప్రతినిధులు, పాలసీ మేకర్స్, స్ట్రోక్ లీడర్‌లు, ఇతర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సీఐ

విశాలాంధ్ర-వినుకొండ: పోలీసు బాధితులు దగ్గర డబ్బులు వసూలు చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. అయితే వినుకొండలో మాత్రం పట్టణ సీఐ సాంబశివరావు వచ్చిన నాటినుండి బాధితుల పక్షాన నిలబడి తన వంతు సాయ, సహకారాలు అందిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం దొంగలు చేసిన దాడిలో ఓ వ్యక్తికి కన్ను పోవడంతో పట్టణ సీఐ సాంబశివరావు 20వేలు రూపాయలు ఇచ్చి మానవత్వం చాటుకున్నాడు. ఇప్పుడున్న పోలీస్ తరంలో ఇతను డిఫరెంట్ శభాష్ పోలీస్.

సీఐడీ సాయంతో కక్ష సాధింపు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో కీలక పాత్ర పోషించిన అధికారులను హక్కున చేర్చుకొని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా... కేవలం రాజకీయ కక్ష సాధింపుతోనే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై సిఐడి సాయంతో కక్ష సాధింపుకు దిగుతున్నారని జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో శ్రావణ్ కుమార్ అధ్యక్షతన ఉమ్మడి గుంటూరు జిల్లా టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాబుతో నేను లోగోను తెలుగుదేశం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు ఒక తెల్ల కాగితంలా కనపడుతున్నాడు. ఎలాగైనా మసిపూయాలనే దుర్మార్గపు ఆలోచనతో అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించి శునకానందం పొందుతున్నారన్నారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి బరితెగించి చంద్రబాబుపై అక్రమ కేసులతో జైల్లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షుడు జి.వి ఆంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు సహా ముఖ్యనేతలను జైళ్లకు పంపించి ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశంలో జగన్ ఉన్నారని.. ఆ పన్నాగాలు సాగవన్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్, మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, యరపతినేని శ్రీనివాసరావు, ఇంచార్జులు మొహమ్మద్ నసీర్ తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాలున్నాయి.. తయారీ ఎక్కడ..!

విశాలాంధ్ర-దుర్గి : గ్రామాల్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించి వాటి ద్వారా వర్మీ కంపోస్టును తయారు చేయాలనే ఉద్దేశ్యంతో 2017లో మండలంలోని గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రోడ్లపై ఉన్న చెత్తాచెదారం నిల్వ ఉండకూడదనే ఆలోచనతో ఏర్పాటు చేసిన సంపద సృష్టి కేంద్రాలు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా 13 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లక్షల రూపాయలతో సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలు పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీలకు అప్పగించారు. కేంద్రాల పనితీరు సక్రమంగా లేకపోవడం, వర్మీ కంపోస్టు తయారు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి రైతుకు గ్రామాల్లో తయారు చేసిన వర్మీ కంపోస్టు కేజీ రూ.10లకే ఇవ్వాలని, వాటి నుంచి వచ్చే ఆదాయం గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేటాయించుకోవాలని ఆదేశాలు జారీచేశారు. కానీ సంపద సృష్టి కేంద్రాలు ఉన్నాయి గానీ తయారు మాత్రం అడిగోప్పల, దుర్గి మినహా ఏ గ్రామ పంచాయతీలో జరగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సంపద సృష్టి కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారుల నుంచి పర్యవేక్షణ కూడా కరువైంది. సంపద సృష్టి కేంద్రాల్లో షెడ్డు మిత్రాలను కూడా ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని గ్రామం చివరకు తీసుకెళ్లి పారవేసే పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి లక్షల రూపాయలతో నిర్మించిన సంపద సృష్టి కేంద్రాల్లో వర్మీ కంపోస్టును తయారు చేసి అందేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు అందుబాటులోకి తెస్తాం: జీఎల్ఎన్ గుప్తా, మండల విస్తరణాధికారి

మండలంలోని కంచరగుంట్ల, నెహూనగర్ తండాలో షెడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. రాగానే షెడ్లు నిర్మాణం చేపడతాం. 11 షెడ్లలో వర్మీ కంపోస్టు తయారు చేయడానికి కరెంట్, వాటర్ సౌకర్యం లేదు. కరెంట్, బోర్ వేయడానికి పంచాయతీలో నిధులు లేవు. దీంతో వర్మీ కంపోస్టు తయారు చేయలేకపోయాము. పంచాయతీలో నిధులు ఉన్నప్పుడు కరెంట్, బోర్లు వేసి సంపద సృష్టి కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

రెండు రోజుల్లో అభ్యంతరాలు తెలియజేయండి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల చిరునామా, పేరు మార్పులను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి అభిప్రాయాలను తెలియచేయాలని తూర్పు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ), నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్, పోలింగ్ కేంద్రాల మార్పుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలను అనుసరించి గుంటూరు నగరంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నగరపాలక సంస్థ అధికారులు కొన్ని కేంద్రాల చిరునామా, మరికొన్ని కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదించారని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా బూత్‌లను పరిశీలించి ఏమైనా మార్పులు ఉంటే అభ్యంతరాలను తెలియచేయాలని కోరారు. కొన్ని కేంద్రాలు నాడు-నేడు పనుల వలన, కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కొనసాగకపోవడం వలన కేంద్రాలను పూర్తిగా మార్పు చేస్తున్నామని, మరికొన్ని కేంద్రాల పేర్లు సరిచేసామని తెలిపారు. తూర్పులో 96, పశ్చిమలో 49 పోలింగ్ కేంద్రాల లోకేషన్స్ మార్చడానికి, తూర్పులో 52, పశ్చిమలో 38 కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు 2 రోజుల్లో అభ్యంతరాలు తెలియచేసిన అనంతరం నివేదిక జిల్లా ఎన్నికల అధికారికి పంపుతామని తెలిపారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్వో, అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఏఈఆర్వోలు బి.శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాస్, కోటయ్య, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, బహుజన్ సమాజ్ పార్టీ సిహెచ్ వాసు, సీపీఎం ఖాసిం షహీద్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ దీక్ష జయప్రదం చేయండి: బూదాల

విశాలాంధ్ర-వినుకొండ: ఈ నెల 15న "చలో విజయవాడ అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ దీక్ష" సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు కోరారు. మంగళవారం సీపీఐ నియోజకవర్గ సమితి అగ్రిగోల్డ్ అండ్ కస్టమర్‌ల బాధితుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రధాన వీధుల్లో కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు తమ భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడతాయనే ఆశతో అగ్రిగోల్డ్‌లో దాచుకున్న సొమ్మును కొల్లగొట్టి వారిని నిండా ముంచారని వాపోయారు. బాధితుల ఆక్రందనాలు ముఖ్యమంత్రికి, మంత్రులకు, శాసనసభ్యులకు, పార్లమెంటు సభ్యులకు వినిపించవా? అన్నారు. పేదల సంక్షేమం కోసం బటన్ నొక్కుతున్న ఈ సీఎంకు అగ్రిగోల్డ్ సంస్థలో డబ్బు దాచుకున్న ఈ పేదలు కనబడట్లేదా? అని ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితుల సొమ్మును వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయవాడలో చేపడుతున్న "శంఖారావ దీక్షకు" నియోజకవర్గంలో అగ్రిగోల్డ్ బాధితులు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉలవలపూడి రాము, బూదాల సాగర్ బాబు, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, కొప్పెరపు మల్లికార్జున, అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

పథకాలు ప్రతి ఒక్కరికి అందించాలనేదే లక్ష్యం

విశాలాంధ్ర-రెంటచింతల : పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్కరికి పేదకు అందించాలనే ఉద్దేశంతోనే గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం రెంటచింతల గ్రామంలో మూడవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమనికి విచ్చేసిన పీఆర్కేకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడమే కాక తక్షణ పరిష్కారం దిశగా అడుగులు వేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు(పార్టీలతో సంబంధం లేకుండా) అనేక సంక్షేమ పథకాలను రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. కరోనా సమయంలో కూడా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. జడ్పీ ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కరరెడ్డి, మద్దిరాల కృష్ణారెడ్డి, గొట్టం బ్రహ్మారెడ్డి, మోర్తల ఉమామహేశ్వరరెడ్డి, పూజల రామయ్య, పేర్ల ముత్తయ్య, మోదుగు శ్రీనివాసరెడ్డి, పమ్మి సీతారామిరెడ్డి, పాముల సంపూర్ణమ్మ, అల్లం ప్రతాప్ రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, కొమ్మారెడ్డి మల్రెడ్డి, బద్దూరి బ్రహ్మారెడ్డి, పులి ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు తావులేకుండా స్త్రీనిధి రుణాల చెల్లింపులు

విశాలాంధ్ర-శావల్యాపురం: స్త్రీనిధి రుణాల చెల్లింపులలో అక్రమాలను నివారించేందుకు ప్రభుత్వం పేటీఎం మిషన్ల ద్వారా స్త్రీనిధి రుణాల చెల్లింపులకు శ్రీకారం చుట్టిందని డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలునాయక్ అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో క్లస్టర్ల వారీగా పేటీఎం మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని పీడీ మంగళవారం ప్రారంభించారు. మండలంలోని కారుమంచి, శావల్యాపురం, వేల్పూరు క్లస్టర్లకు మూడు పేటీఎం మిషన్లను అందజేశారు. పీడీ మాట్లాడుతూ పేటీఎం మిషన్ల పంపిణీని పైలెట్ ప్రాజెక్ట్ శావల్యాపురంలో ప్రారంభించామన్నారు. గతంలో గ్రామ సంఘాల ద్వారా స్త్రీనిధి రుణాలు చెల్లింపులు జరిగేవని, కానీ ఇప్పుడు డ్వాక్రా మహిళలు పేటీఎం మిషన్ల ద్వారా అన్ని రకాల యూపీఐ పెయిమెంట్స్, బ్యాంక్ ఖాతాల ద్వారా రుణాలు చెల్లించి వెంటనే రసీదులు పొందవచ్చన్నారు. రుణాల చెల్లింపులలో వస్తున్న అభియోగాలకు చెక్ పెట్టి చెల్లింపుల్లో పారదర్శకతను పెంచేందుకు పేటీఎం మిషన్లను ప్రారంభించామన్నారు. మండలంలోని ఏ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలైనా మూడు క్లస్టర్లలో ఎక్కడైన రుణాలు చెల్లింపులు చేయవచ్చని, చెల్లింపులతో పాటు రుణాలను కూడా రద్దు చేసుకోవచ్చన్నారు. త్వరలో జిల్లాలోని అన్ని క్లస్టర్లకు పేటీఎం మిషన్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం రంతు చిన్నబుల్లెయ్య, ఐబీడీపీఎం శ్రీలక్ష్మి, బ్యాంక్ లింకేజీ డీపీఎం హనుమనాయక్, ఉన్నతి ఏపీఎం జగజ్జీవన్ రావు, వెలుగు ఏపీఎం వాసుబాబు, సీసీలు ఖాజా, బేబీరాణి, రమాదేవి, రాధ పాల్గొన్నారు.

రుణాల మంజూరు వేగంగా చేపట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టిడ్కో గృహ లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాల మంజూరు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం టిడ్కో లబ్ధిదారులకు రుణాల మంజూరుపై బ్యాంకర్లు, మెప్మా సిఎంఎంలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అడవితక్కెల్లపాడు, వెంగళాయపాలెంల్లో టిడ్కో గృహ సముదాయాలు కేటాయించిన లబ్ధిదారులకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపి రుణాలు మంజూరు వేగంగా చేయాలని కోరారు. కొంత మంది లబ్దిదారులకు సాంకేతిక కారణాలతో రుణాల మంజూరు నిలిపివేసారని, అటువంటి వారికి కూడా పునః పరిశీలన చేసి రుణాలు ఇవ్వాలన్నారు. మెప్మా సిఎంఎంలు ప్రతి లబ్దిదారుల నుండి రుణాల కోసం డాక్యుమెంట్స్‌ని సేకరించి బ్యాంక్‌లకు అందించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిధర్ రెడ్డి, ఉపాసెల్ పి.ఓ. సాంబశివరావు, ఎస్.బి.ఐ., కెనరా, యూనియన్ బ్యాంక్ జిల్లా కంట్రోలర్స్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో అవార్డుల ప్రదానం

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని పూర్వ విద్యార్థుల విభాగం అవార్డులు-2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, అమెరికాలోని కేఎల్‌యూ పూర్వ విద్యార్థుల విభాగ అధ్యక్షులు కిరణ్ పల్లాలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన కేఎల్‌యూ పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విభిన్న రంగాల్లో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సాదించుకున్న పూర్వవిద్యార్థులకు అవార్డులను అందజేసి వారిని ఘనంగా సత్కరించినట్లు పూర్వవిద్యార్థుల సంబంధాల విభాగ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ శ్రీకావ్య తెలిపారు. అనేక సంవత్సరాల తరువాత ఒకే వేదికపైన కలుసుకోవడంతో పాటు పూర్వ విద్యార్థులను సత్కరించుకోవడం తమకు ఎంతగానో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అంతర్జాతీయ సంబంధాల విభాగ డైరెక్టర్, ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.శరత్, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

తరలిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును స్కిల్ డెవలప్మెంట్ కేసులో రాజమండ్రి జైలుకు రిమాండ్ ఖైదీగా పంపిన నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తెదేపా నేతలు ఒంగోలులోని బృందావనం ఫంక్షన్ హాలులో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. పాల్గొనడంకోసం చీరాల నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం తమ నాయకుడిని అరెస్టు చేసి పైశాచిక ఆనందం పొందుతుంది అన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన తమ నాయకుడికి త్వరలోనే బెయిలు వచ్చి బయటకు వస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. త్వరలో రానున్న ఎన్నికల్లో తెదేపాకు అధికారం అప్పగించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలంలోని రామకృష్ణా పురం 1లో ఎస్సీ మహిళ, బీసీ జనరల్, విజయ నగర్ కాలనీలో ఎస్సీ జనరల్, చీరాల నగర్‌లో మహిళ జనరల్,గవినివారిపాలెం 2లో బీసీ జనరల్, కేటగిరుల్లో మొత్తం ఖాళీగా ఉన్న ఐదు వాలంటీర్ల పోస్టులకు ఎంపీడీఓ నేతాజీ నోటిఫికేషన్ విడుదల చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం జనవరి ఒకటవ తేదీ నాటికి 18 నిండి 35 సంవత్సరాలు వయస్సు కలవారై ఉండాలని,పదవ తరగతి ఉత్తీర్ణులై,చీరాల మండల నివాసులై ఉండాలన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 13వ తేది నుండి 19వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక కాబడిన వారికి ఈ నెల 29వ తేదీ ఇంటిమేషన్ లెటర్లను ఇస్తామని 30వ తేదీ నియామకాలు చేపడతామని తెలిపారు.

వెదపెట్టే యంత్రాల పంపిణీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని గవినివారిపాలెం పంచాయితీ విజయలక్ష్మి పురం గ్రామంలో గ్రామసిరి, ఐటీసి సంయుక్త సహాయముతో రైతులకు ఉచితంగా వెదపెట్టే యంత్రాలను పంపిణీ చేశారు. చీరాల వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ కాపూరి రమణారెడ్డి మాట్లాడుతూ యంత్రాలతో వరి, మినుము, మొక్కజొన్న, వేరుశనగ విత్తనాలను వెద పెట్టవచ్చును అని తెలిపారు. గ్రామంలోని పది మంది రైతులను ఒక గ్రూపుగా తయారుచేసి ఒక్కో గ్రూపుకు ఒక యంత్రాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చీరాల ఏడీఏ ఎఫ్రాయిమ్, ఐటిసి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసశాస్త్రి, ప్రకాశం,బాపట్ల జిల్లాల కోఆర్డినేటర్ ఉదయ భాస్కర్, ఏరియా కోఆర్డినేటర్ మహమ్మద్ బిక్కు శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని గవినివారిపాలెం పంచాయితీ కొత్తపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా ఆకుకూరలు పెంచే విధానాన్ని గురించి వివరించారు. జీవామృతం, కషాయాలు వాడే విధంగా మహిళలకు శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.టి భారతి,ఎల్.ఐ నాగేశ్వరరావు, ఎల్.సి.ఆర్.పిలు కవిత, శిరీష, స్వరూప, పద్మజ, శ్రీలత, శ్రావణి, కాపూరి రమణారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్ నేడు బాపట్ల రాక

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ బుధవారం బాపట్ల రానున్నారు. ఉదయం 10 గంటల బాపట్ల ఆర్ అండ్ బి అతిథి గృహానికి వచ్చి అక్కడ నుండి బాపట్ల మండల సూర్యలంక వెళ్లనున్నారు. సూర్యలంకలో ఎస్టీలో గుడిసెలు తొలగింపు తీవ్ర చర్చనీయాంశంగా మారటంతో శంకర్‌నాయక్ విషయాలు తెలుసుకునేందుకు రానున్నట్లు తెలిసింది.

పొగాకు నారుమడి పరిశీలన

విశాలాంధ్ర-టంగుటూరు : మంగళవారం వావిలేటిపాడు గ్రామానికి పొగాకు నారుమడిని పరిశీలిం చడానికి పొగాకు బోర్డ్ ప్రొడక్షన్ మేనేజర్ మరియు ప్రాంతీయ అధికారి ఎం. కృష్ణశ్రీ మరియు ఎక్స్టెన్షన్ మేనేజర్ జి. దామోదర్ అలాగే టంగుటూరు పొగాకు బోర్డ్ వేల నిర్వహణ అధికారి అట్లూరి శ్రీనివాసరావు మరియు సీనియర్ గ్రేడ్ ఆఫీసర్ సిద్ధ రాజు మరియు కొండేపి వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ విచ్చేసి పొగాకు నారుమడిని పరిశీలించినారు. నారుమడులు ఎప్పుడు సిద్ధం చేశారు, నారుమడిలో వేసిన విత్తనం రకము, విత్తనం మోతాదు, నారుమడికి వాడిన ఎరువులు, నారుమడికి అయ్యే ఖర్చులు గురించి అడిగి తెలుసుకున్నారు.

ఎంపీడీవోకి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఎంపీడీవో తాతపూడి సుకుమార్ మరోసారి ఎంపీడీవో గా వెలిగండ్లకి వచ్చిన సందర్భంగా సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు ఆయనకు స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేసి తిని పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ఎంపీడీవో కార్యాలయం నందు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న ఎంపీడీవోనీ ప్రజల మనసులో ఎప్పుడు నిండి ఉంటారని ఆయన అన్నారు. పలువురు ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ పులి రాజేష్‌కు అభినందనలు

విశాలాంధ్ర-కంభం : కంభం ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పులి రాజేష్‌ను ది కంభం ప్రెస్ క్లబ్ సబ్ డివిజన్ అధ్యక్షుడు పఠాన్ అక్బర్ అలీ ఖాన్ ఆదేశాల మేరకు ఉపాధ్యక్షులు షేక్.రసూల్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ఎస్ఐ పులి రాజేష్‌ను మర్యాద పూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ది ప్రెస్ క్లబ్ సబ్ డివిజన్ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

ఎస్ఐ పులి రాజేష్‌కు సన్మానం

విశాలాంధ్ర-కంభం : సాధారణ బదిలీలో భాగంగా కంభం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పులి. రాజేష్ ను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల. అల్లూరయ్య పూల మాలతో శాలువతో ఘనంగా సన్మానించారు.

పెద్దమ్మ తల్లికి పొంగళ్లు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని కాట్రగుంట గ్రామంలో వడిరాజుల కుటుంబీకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం పెద్దమ్మ తల్లికి పొంగళ్ళు సమర్పించారు. మహిళలు గ్రామస్తులు మంగళ వారం బోనాలతో వాయిద్యములతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని పెద్దమ్మ తల్లికి నైవేద్యాలు పెట్టారు.

రైతులకు రుణాల మంజూరులో అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- కలెక్టర్ రంజిత్‌బాషా

విశాలాంధ్ర - బాపట్ల : పంటలు సాగు చేసిన రైతులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ తప్పనిసరిగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ ఆరవ సమీక్షా సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డ్ దారులైన కౌలు రైతులకు రుణ సదుపాయం కల్పించాలని చెప్పారు. 68 వేల మందికి సిసిఆర్సి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం 482 మందికి కార్డులు ఇవ్వడం ఏమిటని బ్యాంక్ అధికారులను నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో రుణం ఇవ్వలేకపోవడం ఏమిటని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగాలకు రూ.10,618 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా గడిచిన మూడు నెలల్లో రూ.4,024.21 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. అలాగే ప్రాధాన్యత లేని రంగాలకు రూ.1,243 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, రూ.623.83 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.11,861 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. గడిచిన మూడు నెలల్లో రూ.4,648 కోట్లు రుణం పంపిణీతో 39.18 శాతం పురోగతి సాధించామన్నారు.లక్ష్య సాధన వైపు ముందుకు వెళ్తున్నామని వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున విరివిగా రుణాలు ఇవ్వాలని ఆయన చెప్పారు. పంట రుణాలు కౌలు రైతులకు తక్కువగా ఇవ్వడం ఏమిటని బ్యాంక్ అధికారులపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 258 బ్యాంక్ బ్రాంచీలతో బాపట్ల జిల్లాలో 27 బ్యాంకులు ఉండగా బ్యాంక్ కంట్రోలర్లు కేవలం ఎనిమిది మంది మాత్రమే హాజరవడంపై కలెక్టర్ మండిపడ్డారు. మరోసారి పునరావృతమైతే చర్యలు తీసుకుంటామన్నారు. గైర్హాజరైన వారిపై, రుణాల మంజూరులో పురోగతి లేని బ్యాంక్ అధికారులపై ఆర్బిఐకు నివేదిస్తామన్నారు. బ్యాంకు అధికారుల నిర్లిప్తతపై సంబంధిత డిఆర్ఓ, ఎల్‌డిఎంలు నివేదిక సిద్ధం చేసి ఆర్.బి.ఐ.కి పంపాలన్నారు. క్షేత్రస్థాయిలో పంటలు సాగు చేసుకుంటున్న కౌలు రైతుల అవసరతను గుర్తించాలన్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ మీటింగ్లో నిర్ణయాలను అమలు చేయలేకపోతే బ్యాంకర్లు ఏం పని చేస్తారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పంటలు సాగు చేస్తున్న వారిని వదిలిపెట్టి పట్టాదారులకు రుణం ఇచ్చామని కారణాలు చెబితే ఊరుకునేది లేదన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రూ.153 కోట్లు రుణాలను కౌలు రైతులకిస్తే, బాపట్లలో కేవలం రూ.35 కోట్లు ఇవ్వడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ముద్ర రుణాల మంజూరు పై ప్రజలకు అవగాహన కల్పించి విస్తృతంగా రుణ సదుపాయం కల్పించాలన్నారు. బాపట్ల జిల్లాలో రూ.26,643.6 కోట్లు బ్యాంకులు వ్యాపారం చేయగా, రూ.9481.35 కోట్ల మేర జమ అయ్యిందని, అడ్వాన్సుల కింద రూ.17,162.25 కోట్ల నిధులు ఇచ్చామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి బ్యాంకర్లు సహకరించాలని ఆయన సూచించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అంది పుచ్చుకుని సమాజంలో డిమాండ్ ఉన్న రంగాలలో శిక్షణ ఇవ్వాలని రూడ్‌సెట్ అధికారులను ఆయన ఆదేశించారు. ఎల్‌డిఎం కృష్ణ నాయక్, నాబార్డ్, రీజనల్ హెడ్ యూనియన్ బ్యాంక్ శంకరరావు, ఆర్.బి.ఐ. మేనేజర్ శంకర్ జిత్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోనపై అసంతృప్తులు..గాదె చెంతకు

విశాలాంధ్ర - బాపట్ల : మొన్నటి వరకు ఎమ్మెల్యే కోనకు అనుంగ అనుచరులుగా తిరిగి నేడు అదే పార్టీ అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న గాదె మధుసూధన్‌రెడ్డి చెంతకు చేరటం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ఎస్సీసెల్ జనరల్ సెక్రేటరీ ముప్పిరి రాజశేఖర్‌బాబు, నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, పిట్టలవానిపాలెం జడ్పీటీసీ భర్త గోవతోటి విజయ్‌లు మంగళవారం మాజీమంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు గాదె మధుసుధన్‌రెడ్డిని బాపట్ల పటేల్‌నగర్‌లోని ఆయన నివాసంలో యువతతో మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. తాము ఎంతోగానో ఎమ్మెల్యే కోన రఘుపతిని నమ్మి నాలుగున్నరేళ్లగా ఆయన వెన్నంటి నడిస్తే పార్టీలో తమకు సముచితస్థానం కల్పించకుండా పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి డబ్బు ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని వాపోయారు. బాపట్ల అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న గాదె మధుసుధన్‌రెడ్డి పార్టీలో అసమ్మతిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులను ఇటీవల కలిసి పార్టీ బలోపేతం కోసం పనిచేద్దాం అంటూ విరివిగా పర్యటించటం మొదలుపెట్టారు. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అసంతృప్తుల లిస్టు బయటకు తీసి దినచర్యలో వారిని కలిసి వర్గాన్ని వ్యాపింపచేసుకునేందుకు పలు విధాలుగా చక్రం తిప్పుతున్నారు. రానున్న కాలంలో ఎటువంటి పరిస్థితులు వైసీపీలో ఉంటాయో అని చర్చ మెదలైంది. ఈ కార్యక్రమంలో గిరిజారాణి, చింతాకిషోర్,కృష్ణమోహన్ రెడ్డి మారుబోయిన శ్రీనివాసురెడ్డి, దేగల రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాట్లకు అనుమతి తప్పనిసరి

- ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలు ఏర్పాట్లు చేసుకునే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. వినాయక చవితికి పందిళ్ళ మండపాలు ఏర్పాటు చేసేవారు పాటించాల్సిన నియమ నిబంధనలు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు ఎస్పీ వివరించారు. కనీసం 5 కంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో గుర్తింపు కార్డు జిరాక్స్‌లు ఇచ్చి పోలీస్ అనుమతి పొందాలన్నారు. ప్రైవేట్ లేదా పంచాయతీ, మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేవారు ముందుగా ప్రవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ లేదా మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వీటితో పాటు స్థలానికి చుట్టపక్కల నివసించే వారి సమ్మతి కుడా పొందాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలని పందిళ్ళు మండపాల వద్ద ఇసుక నీళ్ళను ఏర్పాటు చేసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాలలో దీపారాధనల వలన అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రతలు తీసుకోవాలని, విద్యుత్ వైర్లను ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలన్నారు. ప్రతిష్ఠించనున్న వినాయక విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వ హించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, నిమజ్జన ప్రదేశం విగ్రహ నిమ జ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను పోలీసులకు తెలపాలన్నారు. శబ్దకాలుష్య క్రమబద్దీకరణ నియంత్రణ నింబంధనలు-2000 ప్రకారం రెసిడెన్సి యల్ ఏరియాలో పగలు 55, రాత్రి 45 డెసిబల్స్‌కు మించకుండా ఉండే విధంగా స్పీకర్లను ఉపయోగిం చాలన్నారు. లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయో గించాలన్నారు. భద్రత కొరకు రాత్రి సమయాలలో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు కాపలాగా ఉండవలేనన్నారు. రాత్రి సమయాలలో పందిళ్ళు మండపాలులో డబ్బులు, బంగారం వంటి విలువైన వస్తువులు ఉంచరాదన్నారు. వినాయక పందిళ్ళు గాని, విగ్రహం పెట్టే ప్రదేశం గాని రోడ్లపైన ఉండరాదన్నారు. వినాయక పందిళ్ళ వలన రోడ్లపై రాకపోకలకు అంతరాయం కలగకుండా ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయరాదన్నారు. విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో గులాములు రంగులు చల్లడం, లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం, మందుగుండు సామాగ్రిని పేల్చడం చేయరాదన్నారు. పందిళ్ళ వద్ద ఊరేగింపు సమయాలలో అసభ్య నాట్య ప్రదర్శనలు జరుగకుండా, మద్యం లేదా మత్తు పదార్థాలను సేవించిన లేకుండా ఉండే విధంగా ఉత్సవ నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు.నిమర్జన ఊరేగింపుకు అనుమతించిన సమయం, నిమర్జనకు కేటాయించిన ప్రదేశం ఊరేగింపునకు కేటాయించిన మార్గం నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. వినాయక నిమజ్జనానికి వెళ్లే వాహనంపై మద్యం మత్తు పదార్థాలు సేవించిన మైనర్‌లు ఉండరాదన్నారు. గణేష్ నిమజ్జనానికి వెళ్లేటప్పుడు చిన్న పిల్లలను తీసుకువెళ్లరాదన్నారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా రద్దీని నివారించేందుకు భద్రత కొరకు తగినంత వాలంటీర్లను ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కార్యనిర్వాహకులే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు.వినాయకచవితి పండుగ రోజు నుండి నిమర్జనం వరకు జరిగే పూజలు, వేడుకల సందర్భాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ప్రజలందరూ వినాయక చవితి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ముందస్తు చర్య లలో భాగంగా నియమ నిబంధనలు సూచించామన్నారు.

హతవిధీ ఏమిటీ వి 'చిత్రం'

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్లలో ఇసుక ట్రాక్టర్ వద్ద ఎస్ఈబీ అధికారులు నిలుచున్న ఫోటో చూసి హతవిధీ ఏమిటీ ఈ విచిత్రం అంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. బాపట్ల నియోజకవర్గ వ్యాప్తంగా పగులుకు రాత్రికి తేడా లేకుండా జేసీబీలో 100 అడుగుల లోతు ఇసుక మట్టి తీసి తరలిస్తుంటే బాపట్ల ఎస్ఈబీ అధికారులు మాత్రం ఇసుకతో వెళుతున్న ట్రాక్టర్‌ను పట్టు కోవటం వారి పనితీరుకు అద్దంపడుతుంది. బాపట్ల మండలం పాండు రంగాపురంలో అక్రమంగా ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి ట్రాక్టర్‌ను పట్టుకుని రూ.10 వేలు చలానా విధించామంటూ సమాచారం మీడియాకు ఇచ్చారు. రోజువారీ జీవన అవసరాల కోసం ట్రాక్టర్లలో ఇసుక తరలించే వాటిని అడ్డుకుని రూ.10 వేలు చలాన్లు విధించటం లారీలు వందల వెళుతున్న నిద్రమత్తులో నటించటం అధికారులకు పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిద్ర నుంచి మేల్కొని అడ్డగోలుగా అనకొండల్లా ఇసుక బొక్కేస్తున్నా ఇసుకబ కాసురులను పట్టుకుని నిజాయితీని చాటుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చేనేత పాలకమండలి ఎన్నికలు నిర్వహించాలి

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు తక్షణమే పాలకమండలి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భటిప్రోలు మండల తాసిల్దార్ డి.వెంకటేశ్వరరావుకు చేనేత కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు. చేనేత కార్మిక సంఘాలనాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత సహకారసంఘాల పాలక మండలిలకు గత నాలుగున్నర సంవత్సరాలగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ బోర్డులను ఏర్పాటుచేస్తూ కాలం గడుపుతుందన్నారు. ఈ ఏడాది జులై 7తో సదరు బోర్డుల పదవికాలం ముగిసిందన్నారు.గత రెండు నెలలుగా పాలకమండలి బోర్డులుగాని,ప్రత్యేక అధికారి లేక సహకార సంఘాల్లో రోజువారి కార్యక్రమాలు కుంటుబడి చేనేత కార్మికులకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో పస్తులతో కాలం గడుపుతున్నారని ఆవేదన చెందారు.చేనేత సహకారసంఘాలకు సంబంధించి 2018 ఫిబ్రవరి 10నాటికి పాలకవర్గాల కాలపరిమితి ముగియటంతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సంవత్సరకాలం పాటు పాలకవర్గాల పదవీ కాలాన్ని సంవత్సరం పాటు పొడిగించడం జరిగిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆ పార్టీలోని 5సభ్యులతో కూడిన నామినేటెడ్ బోర్డులను ఏర్పాటు చేసిందని వారు తెలిపారు.అప్పటినుండి ఎన్నికలు నిర్వహించకుండా ఎనిమిది సార్లు నామినేటెడ్ బోర్డు పదవీకాలాన్ని పొడిగించుకుంటూ వచ్చిందని తెలిపారు. నామినేటెడ్ బోర్డు పదవి కాలం ఏడాది జులై ఆరవ తేదీతో ముగియటంతో చేనేత సహకార సంఘా లలో అధ్యక్షులు పాలకవర్గ సభ్యులు లేకపోవడంతో సంఘాలకు సంబంధించి సొమ్ము బ్యాంకుల్లో ఉన్నప్పటికీ ఆ సొమ్ము డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో సహకార సంఘాలు కార్మికులకు పని చూపలేక పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే సహకారసంఘాలకు ఎన్నికలు జరిపించి కార్మికులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘాలనాయకులు గొట్టుముక్కల బాలాజీ, మొరుగుడు సత్యనారాయణ, దీపాల సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, దొంతు కోటేశ్వరరావు,కొన్నిటిని మోహన్ రావు, ఆకురాతి శ్రీనివాసరావు, కె.పార్థసారథి, రామారావు, బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగుతో రైతులకు మేలు

విశాలాంధ్ర-తాళ్లూరు : మిశ్రమ పంటల సాగు, ప్రధాన పంటలో మిశ్రమ పంటలుగా చిరుధాన్యాల సాగు రైతులకు మేలు కలిగిస్తుందని మండల వ్యవసాయాధికారి బి ప్రసాద రావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో పర్యటించి అంతర్ పంటలుగా చిరుధాన్యాల సాగు చేసే రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిశ్రమ ఆహార పంటల సాగు ద్వారా భూమిలో జీవవైవిధ్యం పెంపొందుతుందని దీనివల్ల భూమి సారవంతం అవ్వడమే కాక ఆహార ఉత్పత్తి జరిగి చిన్న, సన్న కారు రైతులకు లాభాన్ని చేకూరుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు ఉన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ముగిసిన నాక్ కమిటీ పర్యటన

విశాలాంధ్ర - రేపల్లె : ఏ.బి.ఆర్ డిగ్రీ కళాశాలలకు గ్రేడ్‌ను ప్రతిపాదించే జాతీయ మదింపు గుర్తింపు సంస్థ(ఎన్.సి.సి) తరపున ముగ్గురు కమిటీ సభ్యుల బృందం పర్యటన ముగిశాయని కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్ర కుమార్ తెలిపారు.ఇందులో భాగంగా కమిటీ సభ్యులు కళాశాల ఐక్యూఏసి,ఎన్.సి.సి మహిళా సాధికారత విభాగం కేరీర్ గైడాన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ క్రీడాప్రాంగణం, విద్యార్థులకు అందుతున్న ఉపకార వేతనాలను పరిశీలించారు. కమిటీ సభ్యులు కళాశాల అభివృద్ధి గురించి వారి సలహాలు, సూచనలను రిపోర్ట్‌లో పొందుపరిచారు.వీడ్కోలు సభలో కమిటీ సభ్యులకు కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం విద్యార్థినీ, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఏ.బి.ఆర్ ప్రభుత్వకళాశాల మంచి నాక్ గ్రేడ్ సాధిస్తుంది అని ప్రిన్సిపల్ టి.సి.రవిచంద్ర కుమార్ ఆశా భావం వ్యక్తం చేశారు.

అధ్వానంగా బాపట్లలో పారిశుధ్యం

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణంలో ఐదో వార్డు రైలుపేట పరిధిలో ఆశ్రమం పక్కన చెట్లు విచ్చలవిడిగా పెరిగాయి. పారిశుధ్యం పడకేస్తుంది. విషసర్పాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ప్రాణాలుపోతే గాని బాపట్ల మున్సిపాలిటీ అధికారులు స్పందించరా అని స్థానికులు వాపోతున్నారు. పాముల సైతం ఇళ్లలోకి వస్తున్న పరిస్థితి,సంబంధిత సచివాలయ అధికారులకు పలుమార్లు తెలిపిన స్పందించని పరిస్థితి లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ దీనిపై దృష్టి సారించి శానిటేషన్ విభాగంతో త్వరితగతిన ఆ ప్రదేశం అంతా కూడా శుభ్రం చేయించాలి అని స్థానికులు కోరుతున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని అన్ని గ్రామలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించనునట్లు ఎంపీడీవో సి.హెచ్ కృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు సీజనల్ వ్యాధులు,వైరల్ జ్వరాలు, డెంగీ, టైఫాయిడ్ లాంటి ప్రమాదకర జ్వరాలు ప్రజల దరిచేరకుండా ఉండాలంటే గ్రామాలలో మురుగునీటి ఆవాసాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలనరు. అదేవిధంగా దోమల నివారణకు ఫాకింగ్ లాంటి చర్యలు తీసుకొని తాగునీటి బోర్లు, బావులు, మురుగు కలవల వద్ద బ్లీచింగ్ క్రమం తప్పకుండా చల్లించలనారు. గ్రామాలలో ప్రజలకు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిబాబు గ్రామ సర్పంచి పసల అంజలి,నాగేశ్వరరావు ఉన్నారు.

వైసీపీ నాయకులు స్థాయిని మరచి మాట్లాడొద్దు

విశాలాంధ్ర - చీరాల : వైసీపీ నాయకులు స్థాయిని మరచి మాట్లాడడం సరికాదని, జనసేన అధినేతపై అవాకులు చెవాకులు పేలితే జనసైనికులు తగిన బుద్ధిచెప్తారని ఉమ్మడి ప్రకాశంజిల్లా కార్యదర్శి గూడూరు శివరామ ప్రసాద్ అన్నారు. గుంటూరు నగర మేయర్ కావాటి మనోహర్ నాయుడు పవన్ కళ్యాణ్‌పై చేసిన అనుచితవ్యాఖ్యలను జనసేన నాయకులు గూడూరు శివరామ ప్రసాద్ తీవ్రంగా ఖండించారు.శివరామ ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడం సరికాదనిన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు అక్రమ కేసులు పెట్టడం,సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడం మానుకోవాలని లేదంటే రాబోయే ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. కాగా గుంటూరులో కావాటి మనోహర నాయుడు చేసిన వ్యాఖ్య లపై ఆందోళన చేపట్టి చీరాల పట్టణ పోలీసు స్టేషన్లో కేసులు పెట్టాలని జనసేన నాయకులు పిలుపిచ్చిన నేపథ్యంలో 30యాక్ట్ అమలులో ఉన్నందున పోలీసులు ముందస్తుగా గూడూరు శివరామ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల శంఖారవం కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-త్రిపురాంతకం : అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం కరపత్రాలను సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15న విజయ వాడలో జరుగు అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు కళాక్షేత్రం నుండి ప్రదర్శన,అనంతరం జింఖానా గ్రౌండ్లో బహిరంగ సభ జరుగునని అయన అన్నారు. పాలకులు కళ్ళు తెరవండి, ఇచ్చిన మాట కట్టుబడి డిపాజిట్ దారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. దగాపడ్డ బాధితులు తమ సొమ్ము సాధించుకోవడం కోసం కదలిరవలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అగ్రిగోల్డ్ బాధితులు, ఏజంట్లు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుప నిచ్చారు. రామయ్య, సత్యనారాయణ, మల్లికార్జున పిచ్చయ్య పాల్గొన్నారు.

'నా మట్టి నా దేశం'

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని రామచంద్రకోట గ్రామంలో మంగళవారం నా మట్టి నా దేశం కార్యక్రమం దోర్నాల మండల బిజెపి అధ్యక్షుడు సూరవరం గడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి పిరికేడు మట్టి, చిటికెడు బియ్యం సేకరణ, చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో అమరవీరుల స్మారక చిహ్నం నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రోగ్రాం దేశవ్యాప్తంగా జరుగుతున్నది, అందులో భాగంగా దోర్నాల మండల అధ్యక్షులు సురవరం గండి వీరారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొచ్చు మల్లారెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అంబటి అల్లూరి రెడ్డి, ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు కాశీ నాయక్, ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు అల్లంపూర్ శ్రీను విజయవంతం చేశారు.

స్పీడ్ గన్‌తో తనిఖీలు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : జాతీయ రహదారి 544డిపై గొబ్బూరు వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో అతివేగంగా పోవు వాహనాలను స్పీడ్ గన్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో అమర్ నాయక్ మరియు ఎంవీఐ మాధవరావు మాట్లాడుతూ చాలా ప్రమా దాలు అతివేగముగా వాహనములు నడపడం వలన ప్రమా దాలు సంభవిస్తున్నాయని పరిమితికి మించి వేగంతో ప్రయాణించే వాహనాల వివరాలు స్పీడ్ గన్‌లో నమోదవుతాయని, తర్వాత అధిక వేగంతో ప్రయాణించిన వాహనం యొక్క జరిమానా వివరాలు వాహన యజ మానికి సంక్షిప్త సందేశం రూపంలో చేరుతా యన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్పీడ్ గన్ పరికరములతో ప్రభుత్వ వారు నిర్దేశించిన వాహనంల వేగ పరిమితుల్లోనే వాహనాన్ని నడపవలెనని పరిమితుల కంటే ఎక్కువ వేగంతో వాహనాన్ని నడిపిన ఎడల ప్రమాదాలు సంభవిం చుటకు అవకాశం ఎక్కువగా ఉన్నదని తెలిపినారు. ప్రమా దాలు నివారించుటకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపి ప్రమాదాలు నివారించాలన్నారు.